# చదువూ - సంస్కారం

"డాక్టరమ్మగారూ ! ఎంతఖర్చైనా భరిస్తాను. మీ కెంత ఫీజు కావాలంటే అంతా ఇచ్చుకుంటాను. నా కమల ఒళ్లు సుఖంగా వుంటే అంతేచాలు నాకు !" ప్రాధేయపూర్వకంగా అన్నాడు నారాయణ. అతగాడి కళ్లలో, కమలపట్ల అతగాడికి గల ప్రేమ, ఆరాధన ప్రతిబింబిస్తోంది.

"ఇంతకూ కమల బాధేమిటో చెప్పావుకావు" అన్నాను మెల్లిగా.

"కడుపునొప్పి, అన్నం సరిగా తినటంలేదు. వారంరోజులనుంచీ మరీ నీరసించి పోయింది." అదెంత పెద్దజబ్బో, చెప్పలేనివాడిలా ఆందోళనగా అన్నాడు.

"మరి బెంగుళూరు పెద్దాసుపత్రిలో ఎందుకు చూపించలేదు ?" అన్నాను నాలో ఎన్నో సందేహాలు....

"అక్కడ ఊరికే రక్తపరీక్షనీ, అదనీ, ఇదనీ ఇంజక్షను లిస్తారట.... ఒద్దని ఏడ్చింది."

"సర్లే. సాయంత్రం డిస్పెన్సరీకి తీసుకురా చూస్తాను. ఈ లోగా యూరిన్, బ్లడ్ టెస్టులు చేయించి, ఆ సర్టిఫికెట్లు పట్టుకురా!" అన్నాను. నారాయణ సరేనని వెళ్లిపోయాడు. డిస్పెన్సరీకి వెళ్లాను. పేషెంట్లను చూచాక, విశ్రాంతిగా కూర్చున్నాను. నా ఆలోచనలంతా కమల చుట్టూరానే తిరుగుతున్నాయి. కమలకు అంతటి జబ్బేమిటి ? అది జబ్బేనా ? లేక....? అసలు ఆరునెలలుగా జబ్బుగా ఉందని నారాయణ చెప్పాడు ముందస్తుగా ! ఆరునెలలు అంటే ? కమల బెంగుళూరు వెళ్లినప్పట్నుంచి ! నా గుండె ఝల్లుమంది ! నా ఊహ నిజమౌతుందా ! కమలలో మానసికంగా పెద్ద

మార్పువచ్చిందా ? ఇలా ఎందుకు జరిగింది ? నా మనస్సు గతాన్ని త్రవ్వుకుంటూ వెడుతోంది, నా ప్రమేయం లేకుండానే.

సుమారు మూడేళ్ళ క్రితం....

నా డిస్పెన్సరీలో స్వీపరుగావున్న శ్రీరాములు, తన కొడుక్కి పెళ్ళి చేయబోతున్నానంటూ చెప్పినపుడు, ఆశ్చర్యపోయాను. శ్రీరాములు కొడుకు నారాయణ ఇరవై ఏళ్ళలోపువాడు ! అప్పుడేనా తండ్రికి కాస్త అనారోగ్యంగా వుంటే, తనువచ్చి, డిస్పెన్సరీలోని గదులన్నీ ఊడ్చి వెళ్ళేవాడు. సన్నగా, అర్భకంగా వుండేవాడి కిప్పుడే పెళ్ళికేం తొందర రొచ్చిందో ! ఆ మాటే అన్నాను శ్రీరాములుతో.

"మా చెల్లెలి కూతురు .... పెద్దమ్మాయివుంది. పేరు కల్లమ్మ. దానెనక ముగ్గురాడపిల్లలున్నారు మాచెల్లెలికి. పెద్దదాన్ని మావాడికి చేసుకోవాలని, నాకూ, మాచెల్లెలుకూ వుంది ! కానీ బావ....కల్లమ్మ నాయన.... వాడాపిల్లకు వేరే మనువులు చూస్తున్నాడట ! అది తెలిసే ఈ తొందర ! తొందరగా ముడెట్టేస్తే ఏ చిక్కూ వుండదు" అన్నాడు, అదేదో అతి సాధారణ విషయమైనట్లు.

"మీ బావసంగతి అలావుంచు. నారాయణకూ, కల్లమ్మకూ, ఒకరి కొకర్ని పెళ్లాడాలని వుందా ? వాళ్ల అభిప్రాయం అడిగారా ?" అన్నాను.

శ్రీరాములు....వయసులో పెద్దవాడూ, డిస్పెన్సరీ ఓపెన్ చేసి నప్పట్నుంచీ నా దగ్గర పనిచేస్తున్నవాడూ, కష్టమూ, సుఖమూ నాతో చెప్పుకుంటున్న వాడూ కావటంవల్ల నాదగ్గర చనువుంది అతగాడికి.... పెద్దపెట్టున నవ్వాడు....నెరసిన జుట్టు తడుముకుంటూ.

"అభిప్రాయమేమిటమ్మగోరూ ! పసిపిల్లలు ! పెద్దోల్లం ఎట్టాచెబితే అట్టాయింటారు !" తేలిగ్గా అని....తనపనిలో మునిగిపోయాడు.

అలాటి చిన్నపిల్లలకు త్వరగా పెళ్ళిచేయటం తప్పనీ, శారీరకంగా ఇంకా కొంతకాలం ఎదగాలనీ, శ్రీరాములుకు చెప్పి లాభంలేదు.

పదిహేనురోజుల తర్వాత పెళ్ళిచేసి, నారాయణనూ, కల్లమ్మనూ వెంటబెట్టుకవచ్చాడు శ్రీరాములు.

నారాయణ పక్కన కల్లమ్మను చూస్తుంటే, నా గుండె ఆగినంత పనైంది. కాకిముక్కుకు దొండపండులా వుందా పిల్ల. తెల్లగా, బొద్దుగా, నారాయణకంటే బలిష్ఠంగా వుంది. బట్టలు మోటుగా కట్టుకున్నా, భాష "యాస" లేకుండా శుభ్రంగా, స్పష్టంగా వుంది. అమాయకంగా అందంగా మెరుస్తున్న కళ్లలో వింత అందాలు తొణికిసలాడుతున్నాయి. ఆమె పక్కనున్న నారాయణ, మరింత నల్లగా, పీలగా, ఆమెకంటే వయసులో చిన్నవాడిలా కన్పిస్తున్నాడు. ఎందుకో అసహ్యంకూడా కలిగిందా క్షణంలో నాకు.

"మా కల్లమ్మ సదూకుంది కూడా నమ్మగోరూ ! అందుకే ఆళ్ళ నాయన ఉద్యోగం చేసుకొనేవాడి కివ్వాలని చూశాడు. నేను మా చెల్లెలూ అడి ఆటలు సాగనివ్వలేదనుకోండి .... మేనరికం పోగొట్టుకోవటమే ?" శ్రీరాములు, బుర్రమీసాలు సరిచేసుకుంటూ గర్వంగా అన్నాడు.

"ఏడవలేకపోయావ్ ! ఎవరికేనా ఉద్యోగం చేసుకొనేవాడికిచ్చి వుంటే సున్నితంగా చూసుకొనేవాడు.... ఇక్కడ కూలికీ, నాలికీ వెళ్ళి.... ఈ అందమంతా బుగ్గిలో పోసినట్లవుతుంది !" అనుకున్నాను లోలోపల బాధగా.

"పిల్ల నచ్చలేదమ్మగోరూ తమరికి ?" అన్నాడు శ్రీరాములు, నా మౌనాన్ని మరోరకంగా ఊహించుకుంటూ.

"నచ్చకపోవటమేమిటి ? బంగారంలా వుంది. " (ఎటొచ్చీ నీ కొడుకే ఏబ్రాసిలా వున్నాడు !) రెండోమాట మనసులో అనుకున్నాను. ఆ పిల్లకేసి చూస్తూ "ఎందాకా చదువుకున్నావు ?" అనడిగాను.

"ఎనిమిదో క్లాసు" అంది మెల్లిగా.

"తర్వాత ఎందుకు మానేశావ్ ?"

"మా ఊళ్ళో ఇకలేదు....వుంటే...." అర్ధోక్తిలో ఆగిపోయింది.

"వుంటే చదువుకునేదానివా ?" కుతూహలంగా అడిగాను.

"ఆ !"

శ్రీరాములు నవ్వాడు. "పిల్లకు చదువంటే ప్రాణం ! సదివిస్తే మీలాగే ఉద్యోగం చేయకపోయిందా !" అన్నాడు గర్వంగా ; అంత గొప్పపిల్ల తన మేనకోడలూ, కోడలూ అయినందుకు ఆనందం, పొంగి పొర్లుతోందతగాడిలో.

నా మనసులో ఆలోచనలు ఊపిరి సలుపనివ్వటంలేదు. నారాయణ అర్భకుడు. అతగాడు రెండుమూడేళ్ళు బ్రహ్మచారిగా వుండటమే మంచిది.

మరో నాలుగేళ్లు కల్లమ్మ చదువుకుంటే, ఆ అమ్మాయి ఏ నర్స్ ట్రైనింగో పూర్తిచేస్తే, నారాయణను నా డిస్పెన్సరీలోనే వార్డ్‌బాయ్‌గా వేసుకుంటాను, కల్లమ్మను నర్సుగా పెట్టుకుంటాను. ఇద్దరూ హాయిగా బ్రతుకుతారు. లేదా ఆమె కిష్టమైతే టీచర్ ట్రైనింగ్‌కు వెడుతుంది. మొత్తంమీద ఆమె అందమూ, నాజూకుతనమూ, చదువూ, నివురుగప్పిన నిప్పులా అక్కడికక్కడే బూడిదయిపోవటం నాకిష్టంలేదు.

"చదువుకొనే ఏర్పాటుచేస్తే చదువుకుంటావా ?" నవ్వులాటగా అన్నాను.

"ఓ !" అంది. నారాయణ మురిసి పోయాడు.

శ్రీరాములు మాత్రం ఇబ్బందిగా నవ్వాడు. "ఇప్పుడింకేం చదువులెండమ్మగోరూ ! మా కింత ఉడకేసి పెడితే .... అదే సదువు !" అన్నాడు.

"ఉడకేసేది బ్రతికినంతకాలం ఉండే పనేగా ! నీ కోడలు చదువు కుని, ఉద్యోగం చేస్తే నీకు గొప్పగా వుండదేమిటి ?" అన్నాను.

"ఉద్యోగం వస్తుందా ?" ఆశగా అడిగాడు శ్రీరాములు.

"చదివిస్తే.... !"

"సూద్దాంలెండి !"

ముగ్గురూ వెళ్ళిపోయారు.

మరునాడు కల్లమ్మ నోసారి రమ్మని కబురు పంపాను శ్రీరాములు చేత. సాయంత్రం వచ్చింది.

"నీకు చదువుకోవాలనుందా ?"

"ఊఁ !"

"ఎక్కడేనా హాస్టల్లోచేర్చి చదివిస్తే చదువుకుంటావా ?"

ఆ పిల్ల కళ్ళలో ఎనలేని మెరుపు.

"ఊరికే భోజనంపెట్టి చదువుచెప్పే ఏర్పాటు చేయిస్తాను. పైన పాతికోపరకో పడితే నే సర్దుకుంటాను. ఏమంటావ్ !"

"అట్లాగే !"

"చదువు పూర్తయ్యేవరకూ నారాయణా, నువ్వూ జాగ్రత్తగా మసలుకో గలిగితే !"

నా మాటలు అర్థంగానట్లు చూచింది. మృదువుగా నా భావం విడ మరచి చెప్పాను.

నవ్వింది. "మా బావకు నేనంటే ప్రాణం. నే చెప్పుకుంటాలెండి అవన్నీ !" అంది సిగ్గుపడుతూ.

"భేష్ ! నారాయణను ఒప్పించగలిగావంటే, నీ చదువుకు అన్ని ఏర్పాట్లూ చేస్తాను. టీచరుగానో, నర్సుగానో లక్షణంగా ఉద్యోగం చేద్దువుగాని !

కల్లమ్మ సంతోషంగా తలాడించింది. మర్నాడే, నారాయణను వెంటబెట్టుకుని నాదగ్గరకు వచ్చింది.

"అది సదూకుంటానంటోందమ్మగోరూ ! సదివించండి" అన్నాడు. కల్లమ్మ భర్తవేపు కృతజ్ఞతగా చూచింది.

ఈమధ్యే, ఇక్కడికి దగ్గరగావున్న ఓ టౌన్‌లో కొత్తగా నిమ్న జాతులవారి కోసం హాస్టలు ప్రారంభించారు. ఉచిత విద్యా, భోజన సౌకర్యాలతో రెండేళ్ళలో మెట్రిక్‌కు తర్ఫీదు ఇస్తారు. పరీక్షకు కూర్చోబెడుతారు. ఆ వివరాలన్నీ సేకరించి ఆ హాస్టల్ మేనేజరుకు ప్రత్యేకంగా వ్రాసి, కల్లమ్మకు సీటు తెప్పించాను.

"కల్లమ్మ' పేరు అంత బాగాలేదు 'కమల' అని మారుస్తాను. ఏమంటావ్ ?" అన్నాను నారాయణతో.

"మీ ఇష్టం !" అన్నాడు ముసి ముసిగా నవ్వుతూ.

కల్లమ్మయితే ఎగిరి గంతేసింది. శ్రీరాములు మాత్రం గొణిగాడు :

"కలుగోలయ్య" అనే దేవుడిపేరు అది....దాన్ని మార్చటం...."

"పోనీ నువ్వా పేరుతోనే పిలువు శ్రీరాములూ : రేపు నీ కోడలు టీచరుగానో, నర్సుగానో వస్తే ఈ పేరు బావుండదు. రిజిష్టర్‌లోనూ, బయటివాళ్ళం మేమూ, కమల అంటాం" అని నచ్చచెప్పాను.

ఈ నెలరోజులూ వరుసగా నాదగ్గరకు వచ్చిపోతుండటంవల్ల నేను ఆ అమ్మాయిపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుండటంవల్లా శ్రీరాములు ఇంటి చుట్టుప్రక్కల వారికి, ఆ కుటుంబం పట్ల గౌరవం ఎక్కువైందట. కల్లమ్మను "కమలమ్మగా" గౌరవిస్తున్నారట. ఆమె ఇప్పుడే నర్సుగానో, టీచరుగానో అయినట్లే మాట్లాడుతున్నారట. ఈ మాటలన్నీ కల్లమ్మ, ఊహూఁ, కమలే చెప్పింది.

కమల హాస్టలుకు వెళ్ళవలసినరోజు, నాదగ్గరకు వచ్చింది, చెప్పి వెళ్ళటానికి.

"జాగ్రత్తగా మసలుకో. చదువుమీద దృష్టి పెట్టు. శలవులకు ఇక్కడికిరా. ఎంత చదువుకున్నా, ఎంత పెద్ద ఉద్యోగాలు చేసినా స్త్రీకి భర్తే సర్వస్వం. అది మాత్రం మరువకు. నా సంగతే చూడు. మా వారు నాకంటే తక్కువచదివారు. ఉద్యోగం కూడా నా ఉద్యోగానికంటే చిన్నదే! అయినా మేమిద్దరం అన్యోన్యంగా వుంటున్నాం కదా ? మమ్మల్నిచూచాకే మా ఆదర్శ దాంపత్యం ఆదర్శంగా పెట్టుకొని, నా స్నేహితురాళ్ళు.... ఎక్కువచదివీ, పెద్ద ఉద్యోగాల్లో వుండీ తక్కువ చదువుకున్న చిన్న ఉద్యోగాల్లో వున్న మగాళ్ళని పెళ్ళాడి, హాయిగా వుంటున్నారు. కాబట్టి స్త్రీ చదువూ, ఉద్యోగం అన్నది అనురాగపూరితమైన దాంపత్య జీవితానికి ఏవిధంగానూ అడ్డురాదు, రాకూడదు. అదే నిజమైన సంస్కారం" అంటూ చిన్న లెక్చరిచ్చాను. మా శ్రీవారు బి.యస్సి. పాసై మెడికల్ రెప్రజెంటేటివ్‌గా వుండగా, ఎం. బి., బి. యస్. పాసై కొత్తగా ప్రాక్టీసు పెట్టిన నేనూ....ఇద్దరం ఇష్టపడి .... పెళ్ళిచేసుకున్నాం. మాది ఆదర్శ దాంపత్యమని అందరూ అనుకుంటారు. మాకూ ఆ గర్వంవుంది !

కమల శ్రద్ధగా విన్నది. "నేను చదువుకుంటే మాత్రం బావ బావకాదా ? భర్త కాదా ? నా భర్తని నేను చులకన చేసుకుంటే నాకే కాదూ అప్రతిష్ఠ ?" అంది వినయంగా. నాకు చాలా సంతోషం కలిగింది. మెప్పుదలగా భుజం తట్టి వెళ్ళిరమ్మన్నాను. ఓ నాలుగుజతల కొత్తబట్టలు తీసిచ్చాను. పరిశుభ్రంగా వుండమని చెప్పాను. అనవసర విషయాలు పట్టించుకోవద్దన్నాను. చదువుమీద దృష్టి కేంద్రీకరించమన్నాను. ఇంకా ఏదో చెప్పబోతుండగా....

"ఈ బాధంతా ఎందుకు యామినీ ! కమలతోబాటు ఈ రెండేళ్లు నువ్వూ హాస్టల్లోవుండి చదివిరా !" అన్నారు శ్రీవారు నవ్వుతూ.

* * * * *

మూడు నెలల్లో మూడు ఉత్తరాలు వ్రాసింది కమల. పాఠాలు మొదలెట్టారనీ, తన గుణగణాలు, చురుకుదనమూ గుర్తించి, తననే హాస్టల్లో అమ్మాయిలందరిమీదా "లీడర్"గా చేశారనీ, పెద్ద డాక్టరమ్మ రికమెండేషన్‌తో వచ్చిన అమ్మాయిగా....తనని స్పెషల్‌గా గౌరవిస్తున్నా రనీ, ఇంత చక్కటి జీవితం,చదువుకొనే అవకాశం కలిగించిన నా ఋణం జన్మజన్మలకూ తీర్చుకోలేననీ ఇలా సాగుతుండేవా ఉత్తరాలు. చెప్పొద్దూ! కమల ఉత్తరం వస్తే నాగురించి నాకే గర్వంగా వుండేది! నేలమీదే లుంగలు చుట్టుకుపోతున్న పూలతీగె అలాగే ధూళి దూసరితమైపోకుండా, చక్కటి పందిరి ప్రాపుగా పెట్టానన్న ఆత్మతృప్తి, కించిత్తు గర్వమూ నాలో చోటుచేసుకున్నాయి!

సంక్రాంతి శలవులకు ఇక్కడికి వచ్చింది కమల.

ఎంత మార్పు! అనవసరంగా తల ఓ పక్కగా దించుకోవటమూ, ఎదురుచూపులు చూడడమూ లేకుండా, సున్నితంగా కనురెప్పలు ఆర్పుతూ (చాలామంది కాలేజి అమ్మాయిలలా అతిగా ఆర్పకుండా!) మధ్య మధ్యలో ఇంగ్లీషు ముక్కలు కలుపుతూ, స్పష్టంగా మాట్లాడుతోంది. పిలక జడ గట్టిగా బిగించివేసి కొసన రిబ్బను పెట్టకుండా, చెవులమీదుగా దువ్వి, మొదట్లో రిబ్బను బిగించి, నాజూకుగా జడ వేసుకుంది. కట్టుకున్న వాయిలు చీరె (నేను కొనిచ్చినదే!) పొందికగా అందంగా వుంది.

"వెల్! అద్భుతంగా మారావు! అందంగా వున్నావు! నారాయణ మూర్ఛపోలేదూ నీ అందంచూచి!" అన్నాను మెప్పుదలగా. సున్నితంగా సిగ్గుపడుతూ నవ్వింది.

"మీరు మాబావకాస్త నచ్చచెప్పండి డాక్టర్!" అంది మెల్లగా, తన గోళ్లు సుతారంగా తుడుచుకుంటూ.

(పై సంబోధనకూడా నాజూగ్గావుంది!)

"ఏమని ?" అనడిగాను.

"ప్రతి శలవులకూ ఇక్కడికి రమ్మని పట్టుబడుతున్నాడు. అప్పుడప్పుడూ తనే వస్తున్నా డక్కడికి. ఈ రెండేళ్ళూ చదువుమీద "కాన్‌సన్‌ట్రేట్" చెయ్యాలి నేను. దాంపత్య జీవితానికి దూరంగా వుంటే తప్ప అది సాధ్యం కాదు" అంది. ఆమె గొంతుకలో వినిపిస్తున్న పట్టుదలా, చదువుపట్ల ఆసక్తీ, నన్ను ముగ్ధురాలిని చేశాయి.

"అలాగే నే చెబుతాలే" అన్నాను. ఆ రోజంతా ఆలోచించాను. నారాయణకెలా చెప్పటమా అని. ఇక్కడే వుంటే, నారాయణ "టెంప్ట్" అవుతుంటాడు. దగ్గరే కాబట్టి తరచూ కమల కోసం వెళుతుంటాడు.

బెంగుళూరులో నా ఫ్రెండ్ డాక్టర్ వనజ .... ఈ మధ్యే స్వంత డిస్పెన్సరీ ఒకటి పెట్టింది. నమ్మకమైన నౌకరు కుర్రాడు కావాలనీ.... స్థానికు డెవరినేనా నౌకరుగా పెట్టుకుంటే, వాడు తన ఇల్లు దోచుకుపోతా డేమోనని భయంగా వుందనీ, నమ్మకమైన కుర్రాణ్ణి ఎవరినేనా పంపమనీ ఉత్తరం వ్రాసింది నెలరోజుల క్రితం. నారాయణ నక్కడికి పంపిస్తాను. మంచి జీతం ఇస్తుంది. చీటికీ మాటికీ నారాయణ పరుగెత్తుకు రావటానికి వీలుండదు. బోలెడంత ఛార్జీలూ, బాధ్యతా రెండూ వుంటాయి కాబట్టి. అదే అన్నాను శ్రీవారితో.

"సో ! యువర్ 'పెట్' ఈజ్ వాంటింగ్ టు గెట్ రిడ్ ఆఫ్ హర్ హస్బెండ్ !" అన్నారు నవ్వుతూ.

ఒళ్ళు మండింది.

"డోంట్ బీ సిల్లీ ! మిమ్మల్ని చదిస్తానంటే, చదువుకోనన్నారు గానీ.... లేకపోతే మనమూ 'కమల'లా పట్టుదల పట్టివుంటే, మీకూ డాక్టర్ డిగ్రీ వచ్చేది కాదూ ?" అన్నాను.

"ఇంకా నయం. వెధవ డిగ్రీకోసం బంగారంవంటి భార్యనూ, విలువైన కాలాన్నీ పాడుచేసుకున్నాం కాదు! నాకు, నా భార్యకు నాకంటే పెద్ద డిగ్రీ వుందన్న కొరవ ఏనాడూ లేదు. ఇక రాదు. నీకు, మొగుడు డాక్టరయి తీరాలని కోరికవుంటే.... నన్నూ 'నారాయణ'లానే ప్రయోగ శాలలో పడెయ్!" అన్నారు నవ్వుతూ.

నేను మాట్లాడలేదు.

"యామినీ!" మృదువుగా పిలిచాడు శ్రీవారు. నీ ప్రయోగంతో పాపం నారాయణను బొత్తిగా "కెటాలటిక్ ఏజంటు"గా (ఒక పదార్థంలో రసాయనిక మార్పుతీసుకోవటం కోసం, వేరొక పదార్థాన్ని కొద్దిపాళ్ళలో కలిపే పదార్థాన్నే "కెటాలిటిక్ ఏజంటు"అంటారు.) మార్చకు అన్నారు.

"సర్లెండి!"

ఆ రోజే వనజకు ఉత్తరం వ్రాసేశాను. శ్రీరాములుకు నాఆలోచన చెబితే జీతం ఎక్కువన్న ఆశతో, వెంటనే అంగీకరించాడు. నారాయణ మాత్రం దూరం ఎక్కువని గొణిగినా, కమల కూడా ఆ ఉద్యోగానికి వెళ్ళమని ప్రాధేయపడుతూ అతగాడికి వ్రాసిన ఉత్తరంతో కదిలివెళ్లాడు. కమలకోసం నారాయణ ఎంతటి త్యాగమైనా చేస్తాడనిపించింది నాకా క్షణంలో! నారాయణమీద గౌరవమూ ఏర్పడింది.

సంవత్సరం గడిచిపోయింది. శలవులు నెలరోజులూ పుట్టింట్లో వుంది కమల. నారాయణ ఒక్కమారు వచ్చివెళ్లాడు! బెంగుళూరు చేరుకున్నాక.... రెండునెలల్లో మా ఫ్రెండ్ వనజ దగ్గర నౌకరీ మానేశాడు నారాయణ.

చాలామంది డబ్బున్నవారికీ, పెద్ద హోదాగల ఉద్యోగస్తులకు ఓ విచిత్రమైన మనస్థితి వుంటుంది.

వేలకొద్దీ రూపాయలు విలాసాలకు ఖర్చుచేస్తారు. ఇన్‌కంటాక్స్ ఎగవేత కోసం.... 'భూరి విరాళాలు' ఇస్తారు! వెంకటేశ్వరస్వామికి బ్రహ్మోత్సవాలూ, కళ్యాణాలూ.... నిలువుదోపిడీలు ఇస్తారు! పెంపుడు కుక్కలకోసం వందలు ఖర్చు పెడతారు! మెప్పులరాయుళ్ళ మాటలకు పందలు దిమ్మరిస్తారు!

కానీ ఇంట్లో నౌకరుకు (పనిమనిషికి) కడుపునిండా తిండిపెట్టరు, పెట్టలేరు! అదొక్కటే చాలా వేస్ట్‌గా కనిపిస్తుంది వారికి! అక్కడే పొదుపు చేయాలనీ భావిస్తారు! నౌకరు కుర్రాడి పొట్ట చాలా పెద్దదిగా.... వాడి ఆకలి చాలా అసహ్యంగా, దరిద్రంగా....తాము ఆ 'ఖర్చు' భరించ లేనంత పెద్దదిగా....అనిపిస్తుంది. సరిగ్గా వనజకూ అదేజబ్బు! నారాయణ నమ్మకస్తుడేగానీ వాణ్ని 'మేపటం' కష్టమైపోయిందిట! వాడు 'గాలి' భోంచేయకపోవడం చిత్రంగా వుందిట!

నారాయణ మెల్లిగా అక్కణ్ణుంచి మానుకుని బెంగుళూరులోనే మిలట్రీ శిక్షణ కేంద్రంలో 'బాయ్'గా చేరాడు! తిన్నంత తిండి, మంచి డ్రెస్సులు.... వాడి చురుకుదనానికీ, మంచితనానికీ మెచ్చుకుని ఆఫీసర్లు ఇచ్చిన వాచీ, ట్రాన్సిస్టరూ మెడచుట్టూరా మఫ్లర్, స్వెట్టరు....'నారాయణేనా?' అనే అనుమానం వచ్చేంత దర్జాగా, హుందాగా వున్నాడు! భోజనసౌకర్యం, నీడపట్టున పనితో, నారాయణ బాగాబలంగా సహజంగా వయసుతోబాటు వచ్చే 'ఛార్మ్'తో అందంగా వున్నాడు. ఇప్పుడు నారాయణా, కమలా ప్రక్క ప్రక్కన నిల్చున్నా మంచి ఈడూజోడూ అనిపిస్తారు.

"ఇంకెంతలే నారాయణా! ఇంకొక్క సంవత్సరం! ఆ తర్వాత మీ ఇద్దరూ ఒకేచోట ఉద్యోగాలు చేసుకోవచ్చు. బెంగుళూరులోనే నర్స్ ట్రైనింగ్‌కు వెళ్ళవచ్చు కమల!" అన్నాను వాత్సల్యంగా చూస్తూ,

తాత్కాలికంగా వాళ్ళిద్దరికీ ఎడబాటు కల్గించింది నేనే. అయినా అలా దూరదూరంగా వుండబట్టే, నారాయణలోనూ, కమలలోనూ ఈ మంచి మార్పు వచ్చిందని నాకు నేనే నచ్చచెప్పుకున్నాను.

"మంచిదమ్మగారూ ! కమల సంతోషమే నా సంతోషం !" అన్నాడు. నారాయణ భాషలో కూడా మంచి మార్పు వచ్చింది.

* * * * * *

తిరిగి రెండో సంవత్సరం ప్రారంభమైంది.

"మా హాస్టల్లోవాళ్ళమంతా పిక్నిక్‌కి వెళ్ళాలనుకుంటున్నాం. నావి బొత్తిగా నాసిరకం బట్టలుగా వున్నాయి. ఫలానా డాక్టరుగారి ఇలాకా అమ్మాయి ఇలాటి బట్టలు కట్టుకోవటమేమిటంటున్నారు మా ఫ్రెండ్సంతా. బట్టలు కొనుక్కోవాలి. పిక్నిక్‌కు కనీసం యాభై రూపాయలేనా పై ఖర్చు లుంటాయి. మీరు నా తల్లిలాటివారు .... పంపిస్తారని ఆశిస్తున్నాను." అంటూ వ్రాసింది కమల.

ఎందుకో ఆ ఉత్తరం చదువుతుంటే నాలో ఏదో భయం .... శంక ....నరనరమూ వ్యాపించింది. మొన్న శలవులైపోయాక మరో నాలుగు జతల బట్టలు, సింపుల్‌గానూ, బాగా మన్నేవిగానూ, మరీ నాసిరకంవి కాకుండానూ కొనిచ్చాను. చేతి ఖర్చులకు పాతికరూపాయలిచ్చాను. (పుస్తకాలూ, పరీక్ష ఫీజూ వగైరాలు పోను) కమలలో "వానిటీ" పెరుగుతోందా ? తన తాహతూ, అంతస్థూ మర్చిపోతోందా ? నా చనువును దుర్వినియోగ పర్చుకొంటోందా ?

మొన్న నోరోజు, క్యాంప్‌నుండి వచ్చిన శ్రీవారన్నారు.

"నిన్నరాత్రి. ఆ టౌన్‌లో ....సినిమాహాల్లో ....రిజర్వ్‌డ్ సీట్సులో కనిపించిందోయ్ యామినీ....నీ కమల, ఆమె పక్కనెవరో బాకులాటి

కుర్రాడు చాలా అందంగా వున్నాడు....వున్నాడు...." అంటూ కొంటెగా కన్నుగీటారు !

నాకు అవమానం, కోపం ఒక్కసారిగా వచ్చేశాయి.

"మీ మగాళ్ళకి అన్నీ అనుమానాలే ! వక్రపు ఆలోచనలే, స్వంత అన్నయ్యో, కజిన్ బ్రదరో అయివుండకూడదూ ?" అన్నాను.

"ఉండవచ్చు. కానీ స్వంత అన్నో, కజిన్ బ్రదరో అయితే, కమల నన్ను చూశాక దొంగలా పారిపోవలసిన అవసరంగానీ, చూడనట్లు నటించవలసిన అవసరంగానీ లేదు. అతగాణ్ణి నాకు పరిచయం చేయవచ్చు.... నీ గురించి క్షేమసమాచారాలు, కేవలం సభ్యతకోసమైనా అడగవచ్చు.

"ఇదేదో ఈనాడు మన ఆంధ్రలో అడుగడుగునా వెల్లివిరుస్తున్న "పవిత్ర సోదర సోదరీ ప్రేమ" తాలూకు అనుబంధంలా వుంది ! నేనే ఆ 'పవిత్రప్రేమ'ను తప్పుగా అర్థంచేసుకుంటున్నానేమో !" అన్నారు వెటకారంగా. కాస్సేపాగి....మళ్ళీ అన్నారు "ఏది ఏమైనా యామినీ ! నీ పెంపుడుచిలుక....నీ చేతులలోనుంచి ఎగిరిపోతుందేమో....బీ కేర్‌ఫుల్ ! అని మెడికల్ చెస్ట్ పట్టుకుని వెళ్ళిపోయారు క్యాంప్‌కు.

కమల అలాటిదా ? చదువుకు అంతరాయం కలుగుతుందని భర్తను దూరంగా ఉంచిన ఆమె ... ప్రేమ వ్యవహారాలలో పడుతుందా ? అదే నిజమైతే, కమలకంటే ముందు నా ప్రిస్టేజి దెబ్బతింటుందేమో !

పులిమీద పుట్రలా ఈ రోజు ఉత్తరం !

ఆ ఆలోచనతోనే, చికాకుతోనే కోపంగా జవాబు వ్రాసేశాను. నా దగ్గర ప్రస్తుతం డబ్బులేదనీ, నాకూ ఖర్చు లెక్కువయ్యాయనీ, ఉన్న బట్టలే సర్దుకోవాల్సిందనీ, చదువు పూర్తయేవరకూ పిక్నిక్‌లూ, ఫీటీకీ

మాటికీ సినిమాలూ లాటి కోరికలు పెంచుకోవద్దనీ, అలా కోరికలు పెంచుకొనే పక్షంలో చదువు మానుకుని రమ్మనీ వ్రాశాను.

జవాబుగా, కమల సవాలక్ష క్షమాపణలతో ఉత్తరం వ్రాసింది. మరెప్పుడూ నా మనసు నొప్పించనంది.

తిరిగి సంక్రాంతి శెలవులకు వచ్చింది కమల.

"ఇంకెంత డాక్టర్ ! మూడు నెలలు ! బావ పాపం ! శత పోరుతున్నాడు, ఒక్కసారి బెంగుళూరు రమ్మని. అతగాడి ఉత్సాహం ఎందుకు చెరపాలి నేను ? నాకోసం, ఇంత త్యాగంచేస్తున్న బావ ఆనందం ఎందుక్కాదనాలి నేను ? వెళ్లొస్తాను.... వ్రతభంగం చెయ్యంలెండి !" అంది నవ్వుతూ. నారాయణ కళ్ళలో కోటిదీపాల వెలుగు ! అందాకా, ముభావంగా కూర్చుని వున్న నాలోని అనుమానాలు కమల మాటలతో ఎక్కడివక్కడ ఎగిరిపోయాయి. కమలలో భర్తపట్ల నిర్లక్ష్యంగానీ, మరో కొత్త 'మోజు'గానీ తగల్లేదు ! ఆత్మీయతా, అనురాగమూ వుంది. ఎటొచ్చీ, చదువుమీదవున్న ఆసక్తీ, పట్టుదలా అంతే ! చిన్నవయసు ! పిక్చరుకెళ్ళాలనీ పిక్నిక్‌కు వెళ్ళాలనీ వుండదా ! నాదగ్గర కాస్తంత చనువు తీసుకుందేమో ! నెనే అనవసరంగా ఊహాగానాలుచేసి.... ఆ అమ్మాయిని పరుషంగా మందలించానేమో ! వెళ్ళిరమ్మని సంతోషంగా చెప్పాను.

ఆ పదిహేనురోజులూ, బెంగుళూరంతా చూపించాడు నారాయణ కమలకు. ఓ లేడీస్ వాచీ కొనిచ్చాడు. నాలుగు మంచి చీరెలూ, లంగాలూ, మాచింగ్ బ్లౌజెస్, గోల్డు కవరింగ్ చెవి రింగులు రెండు జతలూ, సూట్‌కేసూ, మరేవేవో తీసిచ్చాడు. అన్నీ చూపిస్తూ సంతోషంగా కమల బెంగుళూరు విశేషాలు నాకు చెబుతుంటే మధ్యమధ్యలో నారాయణవేపు మెప్పుదలగా, కృతజ్ఞతగా, ప్రేమగా, ఓరగా చూస్తుంటే, నారాయణ

ఆనందంతో, తృప్తిగా, గర్వంతో, ఠీవిగా బోలెడంత ఆత్మవిశ్వాసంతో నిల్చునివుంటే, నాకెంతో ఆనందమనిపించింది.

నేను చాలా మంచిపనిచేశాను. కమలను నేనిలా చదువులో చేర్పించ కుంటే శారీరకంగా, మానసికంగా పరిపక్వం చెందని కమల, నారాయణ ఈసరికి, నీరసంగా, నిర్జీవంగా, పూచికపుల్లల్లాటి అర్భకపు పిల్లలతో.... తెగుళ్ళతో....ఛీ .... ఛీ.... నేను పరోక్షంగా వాళ్ళిదరికీ మరో జన్మ ఇచ్చానేమో !

*　　*　　*　　*　　*

కమల పబ్లిక్ పరీక్షలు వ్రాసి వచ్చింది. "పాసౌతాను !" అంది దృఢంగా. నాకు ఏదో ఘనవిజయం సాధించిన తృప్తి.

"రిజల్ట్సు రాగానే బెంగుళూరు వెళతావా ! అక్కడే నర్సు ట్రైనింగ్‌లో చేరవచ్చు !" అన్నాను కమలతో.

"ఊహూఁ ! ఈమధ్య రాత్రింబగళ్ళు చదివి అలసి పోయాను డాక్టర్ ! ఓ రెణ్ణెలు రెస్ట్ కావాలి నాకు !

"బెంగుళూరులో నీకు రెస్ట్ కేంలోటు !" అన్నాను నవ్వుతూ.

"ఊహూఁ ! నన్ను పెళ్ళాడతానని....బావకంటే ముందు.... మా కులస్తుడేలెండి.... డబుల్ డిగ్రీహోల్డర్ .... ప్రస్తుతం హైదరాబాదులో పెద్ద ఉద్యోగంలో వున్నాడు....వచ్చాడు. మా నాన్న అతగాడికే నన్నిస్తామంటే, మా అమ్మ, మామ పడనివ్వలేదనుకోండి.... నా పెళ్ళి మా బావతో జరిగిపోయిందనుకోండి.

"మొన్ననుు వచ్చాడతగాడు. చాలా మంచివాడు. నన్ను తన స్వంత చెల్లెలిలా చూచుకుంటాడు ! ఒక్కసారి హైద్రాబాదు వచ్చి వెళ్ళ

మని మరీ మరీ కోరాడు! ఓసారి వెళ్ళిరావాలనుకుంటున్నాను. హైద్రాబాదు చూచినట్టూ అవుతుంది. బావకూడా ఒప్పుకున్నాడు. డబ్బూ, బట్టలూ తీసిచ్చాడుకూడా. బావ రావటానికి సెలవులేదట! మిమ్మల్నిక డబ్బు విషయంలో ఇబ్బంది పెట్టనులెండి! ఈసరికే చాలా ఋణపడి వున్నాను మీకు. మీ దయవల్ల మా బావకు మంచి ఉద్యోగం, సంపాదనా దొరికింది అంతే చాలు! ఇక నా ఖర్చులకు ఒకరి క్రింద చేయిచాచవలసిన అవసరం వుండదు!" అంది మృదువుగా.

ఆ మాటలలో ఏదో అపశ్రుతి .... ఏదో వ్యంగ్యం నా గుండెకు గాలంలా తగులుకుంది.

శ్రీవారు ఆ రోజు సినిమాహాల్లో చూచిన "సోదరుడే" ఆ డబుల్ డిగ్రీ హోల్డరు! పెద్ద ఉద్యోగస్తుడు! అతగాడి ఆహ్వానంమీద ఈ "సోదరి" హైద్రాబాదు వెడుతోంది!

నారాయణ తన భర్త! అతగాడి సంపాదన తనది! అది ఆమె ఖర్చుపెట్టుకోవటంలో నా సలహాగానీ.... నాకు భయపడవలసిన అవసరం గానీ ఏమీలేదన్న అర్థాన్ని సూచన ప్రాయంగా తెలియజేస్తోందా కమల నాకు!

ఈ క్షణంలో ....కమల నాకంటే ఎత్తుగా.... చాలా ఎత్తుగా.... నేనామెను ఏవిధంగానూ "కంట్రోల్" చేయలేనంతటి ఎత్తుగా పెరిగి పోయిందనిపించింది.

నేను జవాబు చెప్పేలోగా కమల, నారాయణ చెట్టాపట్టా లేసుకుని నవ్వుకుంటూ వెళ్ళిపోయారు. తర్వాత రెండు రోజుల్లో నారాయణ బెంగుళూరుకూ, కమల హైదరాబాదుకు వెళ్ళిపోయారు! హైద్రాబాదులోనే నర్సు ట్రైనింగ్ పూర్తి చేయిస్తానన్నాడట ఆ "సోదరుడు". కమల ఉత్తరంలో వ్రాసిందని చెప్పాడు శ్రీరాములు.

* * * * *

రిజల్ట్సు వచ్చాయి. కానీ కమల ఫెయిలయింది.

శ్రీరాములు కోడలు (అంతటి తెలివిగలది!) పరీక్ష ఫెయిలు కావటమేమిటని బాధపడుతుంటే.... పైకి ఓదార్చినా, లోలోపల సంతోష పడ్డాను. ఇక చదువు సాకుతో నారాయణకు దూరంగా వుండటానికి వీలుపడదు. హైదరాబాదులో వుండటానికి అసలే వీలుపడదు. ఫెయిలవటమే మంచిదయిందనుకున్నాను.

"ఏదోలే పోతే పోయింది పరీక్ష! బెంగుళూరుకు పంపెయ్ కమలని. అక్కడే ఏదో ఓ షాపులో "సేర్స్ గరల్" గానో....మరేదేనా ఉద్యోగమో చేస్తుందిలే! ఇంకా ఎంతకాలం నారాయణ ఒంటరివాడుగా వుంటాడు!" అన్నాను.

శ్రీరాములు సంతోషంగా ఒప్పుకున్నాడు.

నారాయణ వెంట బెంగుళూరుకు బయల్దేరిన కమల ముఖంలో.... పోయినసారి సెలవులకు నారాయణతోబాటు బెంగుళూరుకు వెళ్తానన్నప్పటి ఉత్సాహంగానీ, పరీక్షలు వ్రాసివచ్చాక ఆ "సోదరుని" ఆహ్వానంమీద హైద్రాబాదు వెళ్తున్నప్పటి హుషారుగానీ మచ్చుకైనా లేవు.

"గుర్రాన్ని తొట్టిదగ్గరకు నడిపించగలం....కానీ నీళ్ళు తాగించ గలమా?" అన్నారు శ్రీవారు.

పదిహేనురోజుల తర్వాత....నారాయణ దగ్గర్నుంచి శ్రీరాములుకు ఉత్తరం వచ్చింది. కమలకు బెంగుళూరు "నీళ్ళు" పడటంలేదట. అస్తమానూ ఏదో బాధగా వుంటోందట!

ఆ ఉత్తరం చదివిన నాకు మతే పోయినట్లయింది!

ఆరునెలలు తిరిగింది. నారాయణ డబ్బు కమల మందులకే సరిపోతోందట!

* * * *

"నమస్కారం అమ్మగారూ !" నారాయణ గొంతుక విని త్రుళ్ళిపడ్డాను. గతమంతా ఆలోచిస్తూ, పైమెంతైంతో చూచుకోలేదు.

నారాయణ ఆసరాతో, మెల్లిగా .... చాలా మెల్లిగా నడిచివస్తోంది కమల.

ఎగ్జామినేషన్ రూంలో టేబిల్ మీద పడుకోమన్నాను. నారాయణ దూరంగా వరండాలో నిల్చునివున్నాడు. నర్సును కూడా ఓ పేషెంటుకు కావలసిన ఆపరేషన్ సామాన్లు అన్నీ స్టెరిలైజ్ చేయమనే సాకుతో బయటికి పంపించేశాను. గది తలుపులువేసి, కమల పడుకునివున్న టేబిల్ దగ్గరగా కుర్చీలాక్కుని కూర్చున్నాను.

నా చేతిలో నారాయణ ఇచ్చిన బ్లడ్ టెస్టు వగైరాల రిజల్టు కాగితా లున్నాయి. బ్లడ్‌లోగానీ, బి. పి.గానీ .... మరేదీ జబ్బులక్షణాలేమీలేవు ! ఆహారం సరిగా తీసుకోనందువల్ల నీరసం మాత్రం వుంది, అంతే ,

"కమలా ! నేను డాక్టర్ని ! రోగి జబ్బుతోపాటు, రోగి మనస్థితిని కూడా తెలుసుకోగలను. నిజంగా నీకే జబ్బూలేదు. అది నీకూతెలుసు. ఆ నిజం బయటకు తెలియటం....ముఖ్యంగా నారాయణకు తెలియడం ఇష్టంలేక నువ్వు బెంగుళూరులో జనరల్ హాస్పిటల్‌లో చూపించుకోలేదు. అవునా ?" నా గొంతుక నాకే ఆశ్చర్యమనిపించేంతటి కఠోరంగా వుంది.

దొరికిపోయిన దొంగలా, ఒక్కసారిగా వాలిపోయింది కమల ముఖం. ఎలాగో సంబాళించుకుంటూ మెల్లిగా అంది "ఊహూఁ! కడుపులో నొప్పి, గుండెల్లో మంట...."

ఆమె మాటలకు అడ్డువస్తూ అరిచాను. "అవేవీ ప్రాణం తీసే జబ్బులు కావు. కానీ....నీలో ప్రవేశించిన జబ్బు దెయ్యంలాంటిది ! నీకు మళ్ళీ చదువుకోవాలనుంది కదూ ?"

కమల కళ్ళు ఒక్కసారిగా మెరిశాయి! జబ్బు సంగతి మర్చిపోయి, చటుక్కునలేచి కూర్చుంది. "అవును డాక్టర్! నాకు చదువుకోవాలనుంది! మరోసారి పరీక్షకు కట్టి...."

ఆమె మాటలు మధ్యలోనే త్రుంచివేస్తూ "మరోసారి హైద్రాబాదు అన్నయ్యతో, మరెందరో అలాటి 'సోదరుల'తో సినిమాలకూ, షికార్లకూ పిక్నిక్‌లకూ పోవాలనుంది. చదువు సాకుతో నారాయణను దూరంగా వుంచుతూ, నీ 'మోజు'లకూ, 'వేషా'లకూ కావలసిన డబ్బు మాత్రం అతగాడి దగ్గర్నుంచి తీసుకుంటూ, అందుకై అతగాడిలో ఆశల రేపుతూ అనురాగం నటిస్తూ వెర్రివాణ్నిచేసి ఆడిస్తూ.... సంవత్సరాల తరబడీ చదువుకోవాలని వుంది! అవునా?

నా గర్జనకు నిర్ఘాంతపోయింది కమల. అంతటి నిష్ఠూరమైన నిజాన్ని భరించలేకపోయింది. అంతలోనే తనను తాను సంబాళించుకుంది. "డాక్టర్ నాతో అంటే అన్నారుగానీ మా బావతో అనకండి. నా మీద నిందవేశారని తెలిస్తే దేవుణ్నయినా సరే—బావ సహించడు. పిచ్చికోపంతో ఏమైనా చేస్తాడు!"

క్షణకాలం స్థాణువులా కూర్చుండిపోయాను. "అవును కమలా! అంతటి పిచ్చి ఆరాధన నీపట్ల వుందతగాడికి. నువ్వు చదువుకున్నదాని వనీ, నువ్వు వెళ్ళే మార్గమే సరైందనీ, నాగరికమైందనే భ్రమ అతగాడిలో కలగజేశావు. అతగాడిలోని ఆ గుడ్డినమ్మకాన్నే, ఆ బలహీనతనే, నువ్వు నీ స్వార్థానికి ఉపయోగించుకుంటున్నావు. వెళ్ళు! చదువుకో! సర్వనాశనమైపో! నీ ముఖం నాకెప్పుడూ చూపించకు!" నన్ను నేను కంట్రోల్ చేసుకోలేక మెల్లిగా లేచివచ్చి కన్సల్టింగ్ రూంలో సోఫాలో వెనక్కు వాలిపోయాను. అలసటగావుంది. నా మీద నాకే అసహ్యంగావుంది. నా తలంతా పగిలిపోతోంది. ఏమిటిలా జరిగింది? ఎందుకిలా జరిగింది?

కల్లమ్మలో ఆమె అందంపట్ల, ఆమె తెలివితేటలపట్ల.... ఆమెకే తెలియని ఆత్మవిశ్వాసాన్నీ, అహంభావాన్నీ నేనే పెంచానా? తన కులం వారిలో, తన సాటివారిలో, తానో ప్రత్యేక వ్యక్తి నన్నభావం నేనే ప్రేరేపించానా?

చదువుతోబాటు, ఇంద్రధనుస్సులాటి లోకాన్నీ, నాగరికతనూ, ఆలోచనలనూ నేనే పరిచయం చేశానా?

నారాయణను దూరంగా వుంచి.... ఆమెలో పురివిప్పుకున్న కోరికలకు.... పరోక్షంగా ప్రక్కమార్గాలకు తిప్పానా?

కల్లమ్మ కమలగా మారి, మానసికంగా పెరిగి, నైతికంగా అధఃపాతాళంలోపడి, నారాయణను కేవలం తన ఆర్థికావసరాలను తీర్చే యంత్రంగా మాత్రమే మార్చుకుందా? నారాయణ, తనలాటి అందగత్తెకూ, చదువుకున్న స్త్రీకి తగనిభర్త అనేభావం పెంపొందించుకుందా?

ఆ మాట పైకిచెప్పలేక, అతగాడితో జీవితం గడపలేక మరోచోటికి ఎగిరే దారిలేక, వలలోపడ్డ పిట్టలా, గిలగిలలాడుతూ అశాంతితో "జబ్బు" సృష్టించుకుందా?

కమలను కల్లమ్మగానే వుంచివుంటే?

నారాయణతో కూలికీ, నాలికీ వెళ్ళేది. ఆమె అందం, తెలివితేటలూ, చదువూ, ఆమెకూ తెలిసేవి కావు. ముతకబట్టలే కట్టేది. పిల్లల్నికంటూ, రోగాలతో, రొప్పులతో ఆ సంసారంలోనే సుఖాన్నీ, దుఃఖాన్నీ చవిచూస్తూ.... పదిమందితోబాటు పదకొండవ మనిషిగా .... జీవించేది కాదా?

నేనే తప్పుచేశానా!

నాలో చెలరేగుతున్న "భేతాళ ప్రశ్నల"కు సమాధానం ఎవరు చెబుతారు?

మృదువైన స్పర్శ !

నా శరీరమంతా చెమటలు పట్టివుంది. శ్రీవారు మృదువుగా కర్చీఫ్‌తో నా నుదురు తుడుస్తున్నారు !

"ఎందుకిలా నెర్వస్ అయిపోయావ్ యామినీ !" అన్నారు మృదువుగా ! వివరించలేనిబాధ ! సమాధానంలేని ప్రశ్నలు ! నా హృదయంలోని ప్రశ్నలు చదవగల నేర్పు....వారికుంది.

"కమలగురించే కదూ అంత బాధ నీకు ! నీ తప్పేముందిందులో! మంచి కోరావు .... చెడు జరిగింది; కానీ కమలను నీతో సరిపోల్చు కోవటంలోనే తప్పటడుగు వేశావు. అందరూ యామినులుకారు ! అందరికీ సంస్కారం ఉండదు.

యామినీ ! మనిషి, పులి, స్వభావాలు చాలా దగ్గరగా వుంటాయి. ఓసారి మనిషి రక్తం రుచిచూచిన పులి .... ఎప్పుడూ మనిషి రక్తాన్నే కోరుతుంది.

మనిషికూడా అంతే ! ఒకసారి సుఖాన్నీ, విలాసాలనూ, స్వేచ్ఛనూ రుచిచూచాడంటేచాలు....ఇక ఆ మనిషి చూపూ, పరుగూ, మనసూ అటే వుంటాయి ! ఎవరో జన్మతః సంస్కారవంతులుతప్ప కమలలాటివారింతే, కమల "రుచిమరగిన పులి"గా మారింది. ఆమె నిక ఎవరూ మార్చలేరు. పద ! హాయిగా స్నానం చేసిరా ! భోజనంచేసి రెస్ట్‌తీసుకో.... కమలను యిక మర్చిపో !"

నాలోని భేతాళ ప్రశ్నలకు సమాధానం దొరికింది. కానీ భేతాళు డింకా వెళ్ళిపోలేదు చెట్టుకొమ్మమీదికి.

"నా భార్య జబ్బేమిటి ? ఆమెకేం మందులిస్తారు ? ఎలా అయినా ఆమెకు ఆరోగ్యం ప్రసాదించండి !" అన్నట్లు దీనంగావున్న నారాయణ ముఖం పదే పదే నాకళ్ళముందు మెదలుతోంది ! నారాయణకు నిజం తెలిస్తే .... ఆతగాడి గుండె పగిలిపోతుందేమో ! నారాయణకేం సమాధానం చెప్పను ?

("యువ" దీపావళి సంచిక 1972)